క్లుప్తంగా

కోవ లక్ష్మికి అభినందనలు



అభినందిస్తున్న వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం

కెరమెరి: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి విజయం సాధించడంతో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం మండలానికి చెందిన ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాథోడ్ ఉత్తం నాయక్, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆదివాసీలు ఆసిఫాబాద్‌లోని కోవ లక్ష్మి స్వగృహంలో ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. మిఠాయిలు తినిపించి శాలువాలతో సన్మానించారు.

బీజేపీ నాయకుల సంబరాలు



ముత్తంపేట్‌లో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

కౌటాల: సిర్పూర్ ఎమ్మెల్యేగా పాల్వాయి హరీశ్‌బాబు గెలుపొందడంతో మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో బీజేపీ నాయకులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కాలనీల్లో విజయోత్సవ ర్యాలీ తీశారు. టపాసులు పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పాల్వాయి పాలనలో సిర్పూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బందురావు, ప్రవీణ్, రవితేజ, అంజన్న, కాశీనాథ్, రవిచారి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు బిక్ష



స్వాములకు అన్నం వితరణ చేస్తున్న శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: నిత్యాన్నదాన వితరణలో భాగంగా పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ –డాక్టర్ అనిత దంపతులు అన్నవితరణ (బిక్ష) కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామివారికి పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తు అశోక్, చేరాల శ్రీనివాస్, వలపదసు రమేశ్, పోచన్న, రాజేందర్, కంపెల్లి సంతోష్, శైలజ, స్వాములు శ్రీనివాస్, జింక సంతోష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



సన్మానిస్తున్న అందెవెల్లి గ్రామస్తులు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ ఎమ్మెల్యేగా పాల్వాయి హరీశ్‌బాబు గెలుపు కోసం కృషి చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌ను అందెవెల్లి గ్రామస్తులు సన్మానించారు. సోమవారం ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దహెగాం మండలం పికలగూడెం గ్రామస్తులు, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు బోరెం శంకర్, మాజీ ఎంపీటీసీ సోమ శేఖర్, దుర్గం కేదర్, జాడి వెంకటి, బొరెం కిష్టయ్య, చిన్నయ్య, నాయిని శ్రీను, జాడి లోకేష్, చీకటి ప్రవీణ్, శ్రీనివాస్, కమలాకర్, సంతోష్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వెల్లివిరిసిన చైతన్యం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాసనసభ ఎన్నికల్లో భాగంగా జరిగిన పోలింగ్‌లో హాజీపూర్ మండలంలోని గిరి గ్రామాలు పలువురికి ఆదర్శంగా నిలిచాయి. ర్యాలీ, గఢ్‌పూర్, నాగారం గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లకు ఓటర్లు పోటెత్తారు. 97వ పోలింగ్ స్టేషన్ ర్యాలీ గ్రామంలో 746ఓటర్లకు గాను 678మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 103పోలింగ్ స్టేషన్ గఢ్‌పూర్‌లో 819మందికి 710మంది ఓటర్లు, 104పోలింగ్ స్టేషన్ నాగారంలో 975మంది ఓటర్లకు 852మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో ఈ గ్రామాల్లో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదు కావడంతో ఎన్నికల అధికారులు ఓ వైపు సంతృప్తి వ్యక్తం చేయగా, ఇక రాజకీయ పార్టీల్లో మాత్రం ఓటింగ్ పెరగడంతో ఎవరికి ఏం ముప్పు జరుగుతుందోనన్న ఆందోళన కూడా నెలకొనగా ఫలితాలు సైతం అందరినీ ఆశ్చర్యపరిచాయి. పోలింగ్ శాతంగా చూస్తే ర్యాలీ 91 శాతం, గఢ్‌పూర్ 86 శాతం, నాగారం 88శాతం పోలింగ్ జరిగింది.

గుబులు పుట్టిస్తున్న 'మిచాంగ్'

- తుపాన్ ప్రభావంతో వర్షసూచన
- పత్తి, వరి పంటలపై ప్రతికూల ప్రభావం
- ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల పాట్లు

బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్ రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తుపాన్ ప్రభావంతో ఆకాశం పూర్తిగా మబ్బులతో కప్పేసి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని ప్రకటించడంతో పంట వర్షార్పణం కానుందని రైతులు కలవరపడుతున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి పత్తి తడిచిపోగా, వరి పైరు నేల కొరిగింది. దాంతో పత్తి ఏరే అవకాశం లేకుండా పోగా, వరి పొలాలు తడిగా మారి కోతలు చేపట్టేందుకు వీలు లేకుండా పోయాయి. ఎండలు కొడితే తప్పా వ్యవసాయ పనులు సాగే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. –రెబ్బెన



అకాల వర్షంతో చెట్లపైనే తడిసిన పత్తి

ఆరంభంలోనే మొదలైన కష్టాలు

మండలంలో వానాకాలం సీజన్‌లో వేసిన పంటలు చేతికొందే దశలో పడుతున్న అకాల వర్షాలు పంటలను దెబ్బతీస్తున్నాయి. వాతావరణ ప్రతికూల పరిస్థితుల మూలంగా పనులు ముందుకు సాగడం లేదు. చేతికి అందిన పంటలన్నీ వ్యవసాయ భూముల్లోనే ఉండటంతో రైతుల గుండె బరువెక్కుతోంది. వానాకాలంలో మండలంలో సుమారు 25వేల ఎకరాల్లో పత్తి, 6601 ఎకరాల్లో వరి పంటలు సాగు చేశారు. ప్రస్తుతం మండలంలో చాలా మంది పత్తి రైతులు మొదటి దశ పత్తి ఏరే పనులు ఇంకా చేపట్టలేదు. కూలీల కొరత మూలంగా పత్తి ఏరే పనులు సాగడం లేదు. అతికొద్ది మంది రైతులు మాత్రమే మొదటి దశ పత్తిని ఏరి ఇళ్లలో భద్రపరుచుకున్నారు. మూడు రోజుల క్రితం కురిసిన అకాల వర్షంతో వేలాది ఎకరాల్లో ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి తడిసి ముద్దయ్యింది.

వరి పంటపై ప్రభావం..

మండలంలో సాగు చేసిన వరి పంటలు కోతకు వచ్చాయి. బోర్ల కింద సాగు చేసిన వరిలో కొంత భాగం కోతలు పూర్తి కాగా, హార్వెస్టర్ యంత్రాల కొరత మూలంగా 5వేల ఎకరాలకు వరి పంట పైగా కోతలు చేపట్టాల్సి ఉంది. అకాల వర్షం, ఆకాశంలో కమ్ముకున్న మబ్బుల కారణంగా పొలాల్లో తడి ఆరడం లేదు. అకాల వర్షానికి వందలాది ఎకరాల్లో వరిపైరు నేలమట్టం కావడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుంది.

ధాన్యాన్ని కాపాడుకునేందుకు తిప్పలు

తుపాన్ ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కోతలను పూర్తి చేసుకున్న రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే పనుల్లో భాగంగా వాతావరణ శాఖ హెచ్చరికలతో అప్రమత్తమయ్యారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీపై అందించే టార్పాలిన్ కవర్లు అందించకపోవడతో మార్కెట్‌లో అధిక ధరలను టార్పాలిన్ కవర్లు కొనుగోలు చేసి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆకాశం మేఘావృతమై ఉండటంతో ధాన్యంలో తేమ కారణంగా నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అన్నదాతల తంటా!





దహెగాం: మండలంలో సోమవారం జల్లులు కురువడంతో ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడ్డారు. వర్షానికి తడవకుండా ధాన్యాన్ని కుప్పలుగా చేయడం, నేర్పిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పడం, ఎడ్లబండిలో ఇంటికి తరలించడం చేశారు. ఎన్నో తిప్పలు పడుతున్నా అధికారులు మాత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని వాపోతున్నారు.

హ్యాట్రిక్ ఓటమి!

- మూడుసార్లు నాలుగో స్థానంలో రావి శ్రీనివాస్



రావి శ్రీనివాస్

కౌటాల: సిర్పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రావి శ్రీనివాస్‌కు మూడోసారి కూడా ఓటమి తప్ప లేదు. రావి శ్రీనివాస్ యువ నాయకుడిగా 2006లో టీడీపీలో చేరారు. నియోజకవర్గ స్థాయి నాయకుడిగా ఎదిగారు. మొదటి సారి 2014లో టీడీపీ నుంచి సిర్పూర్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అప్పుడు 19వేలకు పైగా ఓట్లు సాధించి నాలుగో స్థానంలో నిలిచారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 2018లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించి టికెట్ రాకపోవడంతో బీఎస్పీ నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. 2018లో 5379 ఓట్లు పొంది నాలుగోస్థానం సాధించారు. ప్రస్తుతం మూడోసారి కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచి 8427 ఓట్లు సాధించి నాలుగో స్థానంలో నిలిచారు. మూడు సార్లు ప్రధాన పార్టీల నుంచి ఎన్నికల బరిలో నిలిచిన రావి శ్రీనివాస్‌కు నిరాశ తప్పడం లేదు. రావి శ్రీనివాస్ ఎన్నికల బరిలో నిలిచిన ప్రతీసారి నాలుగో స్థానంలో నిలవడం గమనార్హం.

గెలుపోటములపై అభ్యర్థుల సమీక్ష



ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తికావడంతో జిల్లాలో వివిధ పార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు గెలుపోటములపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ విజయం సాధించగా, కాంగ్రెస్ రెండో స్థానంలో, స్వతంత్ర అభ్యర్థి కోట్నాక విజయ్ కుమార్ మూడో స్థానంలో నిలిచారు. ఇతర పార్టీల అభ్యర్థులు అంతగా ప్రభావం చూపలేదు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 1,84,07 ఓట్లు పోల్ కాగా, బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి, కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాం నాయక్‌పై 22,810 ఓట్ల మెజార్టీతో గెలిచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 171 స్వల్ప ఓట్ల మెజార్టీతో ఓడిన కోవ లక్ష్మి ఈ ఎన్నికల్లో ముందు జాగ్రత్త పడటంతో భారీ మెజార్టీ సాధించారు. బీజేపీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ గోండు సామాజిక వర్గానికి చెందిన స్వతంత్ర అభ్యర్థి కొట్నాక విజయ్‌కుమార్ 16,469 ఓట్లు పొందారు. సిర్పూర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు, బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పపై 3,088 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన హరీశ్‌బాబు ఈసారి పక్కా ప్రణాళికతో ముందుకెళ్లారు. సిర్పూర్‌లో బీఆర్ఎస్, బీఎస్పీ, బీజేపీల మధ్య త్రిముఖ పోటీ నెలకొనడంతో హరీశ్‌బాబుకు కలిసొచ్చినట్లు విశ్లేషకులు చర్చిస్తున్నారు.

జయాపజయాలపై బేరీజు..

కౌంటింగ్ ప్రక్రియ పూర్తవడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు జయాపజయాలపై బేరీజు వేసుకుంటున్నారు. పోలింగ్ బూత్‌లు, గ్రామాలు, మండలాల వారీగా తమ ప్లస్, మైనస్‌లను సమీక్షిస్తున్నారు. తమకు ఏఏ గ్రామాల్లో మెజార్టీ వచ్చింది, ఎక్కడ తగ్గిందన్న అంశాలపై లెక్కలేసుకుంటున్నారు. ఎక్కడ పొరపాట్లు జరిగాయో తెలుసుకుంటున్నారు. సిర్పూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప, విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి హరీశ్‌బాబుకు గట్టి పోటీ ఇచ్చినా ఎట్టకేలకు హరీశ్‌బాబు విజయం సాధించారు. బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మూడో స్థానంలో నిలిచారు. ఇదిలా ఉండగా జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి పాలవడం, రాష్ట్రంలో ఆ పార్టీకి అధికారం రావడంతో జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

వాంకిడి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని చిన్న బెండార గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సామేల (ఒడ్డెరవాడ) గ్రామానికి చెందిన దేవ్కళ్ల బాపు(55) ద్విచక్రవాహనంపై ఆసిఫాబాద్‌కు వెళ్లి రాత్రి 8 గంటల సమయంలో తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఎడ్ల బండిని ఢీకొన్నాడు. దీంతో బాపు అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం ఆసిఫాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

బీఆర్ఎస్‌కే పట్టం కట్టిన కెరమెరి

- కోవ లక్ష్మికి 594 ఓట్ల ఆధిక్యం

కెరమెరి: మండలవాసులు ఈ సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి పట్టం కట్టారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లోని 29 పోలింగ్ కేంద్రాల్లో 19,049 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందులో బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి 8,236 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్‌కు 7642 ఓట్లు వచ్చాయి. కోవ లక్ష్మి 594 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. కాగా శ్యాంనాయక్‌కు పరందోళి, సావర్ ఖెడా, ఇందాపూర్, నాగల్‌గోంది, మోడి, టోకెన్‌మోవాడ్, కెరమెరిలో మూడు (100, 101, 102) పోలింగ్ కేంద్రాలు, దేవాపూర్, కరంజివాడ, ఆనార్‌పల్లిల్లో కోవ లక్ష్మి కంటే 1271 ఓట్ల ఆధిక్యం పొందారు. కోవ లక్ష్మి ముకదంగూడ, కొఠారి, కల్లెగాం, గోయగాం, నిసాని, సుర్దాపూర్, ధనోరా, ఖైరీ, మెట్టపిప్రి, పాట్నాపూర్, కెరమెరి(103), కెస్లాగూడ, సాంగ్వి,



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు (ఫైల్)

కెలిబి, కరంజివాడ(102), భోలాపటార్, అంతాపూర్‌లో పోలింగ్ కేంద్రాల్లో శ్యాంనాయక్ కంటే 1865 ఎక్కువ ఓట్లు పొందారు. కాగా మండల కేంద్రంలో కోవ లక్ష్మికి మూడు పోలింగ్ కేంద్రాల్లో సమీప ప్రత్యర్థి కంటే తక్కువ ఓట్లు రావడం గమనార్హం. మండలంలో బీజేపీ అభ్యర్థి అజ్మీరా ఆత్మారాం నాయక్‌కు 535, బీఎస్పీ అభ్యర్థి కనక ప్రభాకర్‌కు 377, స్వతంత్ర అభ్యర్థి కోట్నాక విజయ్‌కుమార్‌కు 928 ఓట్లు వచ్చాయి.

అసాంఘిక శక్తులపై నిఘా

కోటపల్లి: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో కోటపల్లి మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అసాంఘిక శక్తులపై నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ విద్యాసాగర్, ఎస్సై సురేశ్ తెలిపారు. నాగంపేట, బొప్పారం అటవీప్రాంతాల్లో సోమవారం క్షుణ్ణంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. వారోత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు వివరించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ విద్యాసాగర్ కోరారు. తనిఖీల్లో స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

'మావోయిస్టుల ప్రలోభాలకు ఆకర్షితులు కావొద్దు'

వేమనపల్లి: మావోయిస్టుల ప్రలోభాలకు లొంగకుండా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ అన్నారు. పీఎల్‌జీఏ వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రాణహిత ఫెర్రీ పాయింట్ వద్ద నీల్వాయి ఎస్సై సుబ్బారావుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. నీల్వాయి, కోటపల్లి అటవీ ప్రధాన రహదారి వెంట ఆర్‌వోపీ నిర్వహణ, బ్రిడ్జి కల్వర్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8వ తేదీ వరకు నిర్వహించనున్న వారోత్సవాలకు ఎవరు సహకరించకూడదని, ప్రలోభాలకు లొంగకూడదన్నారు. అపరిచిత, కొత్త వ్యక్తులు కలిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

పొదతో పొంచి ఉన్న ప్రమాదం



పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ –కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో దరోగపల్లి వద్ద రోడ్డుపైకి చెట్ల పొదలు రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందల మంది వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారని, పొదలతో ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

సమస్యల వలయంలో 'భీమ్‌రెల్ల'

- అందని మిషన్ భగీరథ నీరు
- అధ్వానంగా రోడ్డు
- కాలమేదైనా కాలినడకే దిక్కు



బండరాళ్లతో అధ్వానంగా రహదారి

తిర్యాణి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అనేక నిధులు కేటాయిస్తూ, అనేక పథకాలు ప్రవేశపెడుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో అవి అమలు కాకపోవడంతో కొన్ని గ్రామాలు నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయి. మండలంలోని ఉమ్మడి మంగి గ్రామపంచాయతీ పరిధిలోని భీమ్‌రెల్ల గ్రామంలో ప్రజలకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారు.

కాలమేదైనా కాలినడకనే..

మండలంలోని తోయరేటి గ్రామం నుంచి దాదాపు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమ్‌రెల్ల గ్రామంలో ఏళ్లుగా సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామంలో 15 ఆదివాసీ కుటుంబాలు ఉండగా దాదాపు 50 మంది వరకు జనాభా ఉన్నారు. నేటికీ ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఏ కాలంలో అయిన గ్రామస్తులకు కాలినడకే దిక్కవుతోంది. ప్రతీ అవసరానికి తోయరేటి గ్రామానికి కాలినడకన వెళ్లి అక్కడి నుంచి వాహనాల ద్వారా మంగి లేదా తిర్యాణి వెళ్లాల్సి ఉంటుంది. అయితే కాలినడకన వెళ్లే దారి కూడా ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దారి మొత్తం పెద్ద బండరాళ్లతో నిండి ఉండగా, మధ్యలో వాగు ఉండటంతో వర్షాకాలంలో రాకపోకలు సాగించడం కష్టమవుతోంది. రేషన్ బియ్యం, పింఛన్, నిత్యావసర సరుకుల కొనుగోలుకు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటికి తిప్పలు..

ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద భీమ్‌రెల్ల గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మించింది. కానీ ట్యాంకులోకి నీటి సరఫరా చేయకపోవడంతో మంచి నీటికి గ్రామస్తులు తిప్పలు పడుతున్నారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాగు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. మిషన్ భగీరథ ట్యాంకు నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ట్యాంకులో నీటిని నింపినా నిల్వ ఉండకుండా వృథాగా పోతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ట్యాంకు మరమ్మతులు చేపట్టడంతో పాటు క్రమం తప్పకుండా నీటి సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామానికి వెళ్లే దారి కనీసం ద్విచక్ర వాహనం వెళ్లేందుకు కూడా అనుకూలంగా లేకపోవడంతో అత్యవసర సమయంలో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు పడరాని పాట్లు పడుతున్నామని, అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అలంకారప్రాయంగా మిషన్ భగీరథ ట్యాంక్

మస్తు కష్టమవుతుంది..



మా గ్రామానికి వెళ్లడానికి కనీసం నడిచే దారి కూడా లేకపోవడంతో మస్తు కష్టమవుతుంది. గ్రామం నుంచి ఎక్కడికైన వెళ్లాలంటే పెద్ద బండలున్న దారి వెంట వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వర్షాకాలంలో వాగు ఉప్పొంగితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి.

– రాము, భీమ్‌రెల్ల

కనీస సౌకర్యాలు కల్పించాలి



మా ఊరిలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ ట్యాంక్ నిర్మాణం చేపట్టినా నేటికీ నీటి సరఫరా చేయలేదు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాగు నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం.

– శ్రీనివాస్, భీమ్‌రెల్ల

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం వద్ద రైతులు

వేమనపెల్లి: మండలంలో దస్నాపూర్ గ్రామానికి చెందిన డీసీఎంఎల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సెంటర్ ఇన్‌చార్జి తాల్ల తిరుమల్ గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2103 మద్దతు ధర ఉంటుందని ఆయన తెలిపారు. దళారులను ఆశ్రయించకుండా రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పోషగౌడ్, రామగౌడ్, వెంకగౌడ్, రోషిరెడ్డి, తిరుపతి గౌడ్, నాళ్ల వెంకగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899